క్లుప్తంగా

పాఠశాలల సందర్శన



శంకరపట్నం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను మానిటరింగ్ కమిటీ సభ్యులు సందర్శించారు. ఎస్సెస్సీ విద్యార్థుల ఇంటర్నల్ మార్కులు వేసేందుకు సమర్పించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మానిటరింగ్ టీం అధికారి జీవన్‌రెడ్డి, సభ్యులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాస్‌రావు దేశ్‌ముఖ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ

హుజూరాబాద్: పట్టణంలోని కాకతీయకాలనీ మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న హుమేర తస్నీమ్ అంతర్జాతీయ కరాటే పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మెడల్ సాధించిందని, హెచ్‌ఎం గీతాషాజు గురువారం ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన అంతర్జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ కట్టాస్ ఎనిమిదేళ్ల బాలికల విభాగంలో తస్నీమ్ బంగారు పతకం సాధించిందన్నారు. విద్యార్థినికి పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి మద్దతుగా ప్రచారం



గుండ్లపల్లిలో ప్రచారం చేస్తున్న భాస్కర్

గన్నేరువరం: ఉమ్మడి కరీంనగర్–ఆదిలాబాద్–నిజామాబాద్–మెదక్ జిల్లాల పరిధిలోని ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య వైపు చూస్తున్నారని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ అన్నారు. మండలంలోని గుండ్లపల్లిలో గురువారం కొమురయ్యకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఉపాధ్యాయుడు ఆయన గెలుపునకు కృషి చేస్తున్నారని, సీపీఎస్ ఉద్యోగులు ఆయన వెంటే ఉన్నారని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం, సీపీఎస్ విధానం రద్దు కావాలంటే కొమురయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో భగత్‌రెడ్డి, సాగర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఆలోచించి ఓటేయాలి



మాట్లాడుతున్న యాదగిరి శేఖర్‌రావు

హుజూరాబాద్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకు అవకాశమివ్వాలని, పట్టభద్రులు ఆలోచించి ఓటేయాలని స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు అన్నారు. గురువారం పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలోని వాకర్స్‌తో మాట్లాడారు. ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమం, సమస్యలు, నిరుద్యోగంపై స్పష్టమైన అవగాహన ఉందని, వాటి పరిష్కారం కోసం తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్మా మండలాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బాధ్యులు రాజ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, కోటేశ్వర్, విన్సెంట్ జార్జ్, షాజుథామస్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు పనులు అడ్డగింత



శంకరపట్నం: జాతీయ రహదారి నిర్మాణం కోసం వ్యవసాయ భూమి సేకరించి పరిహారం తక్కువ చెల్లించారని మండలంలోని తాడికల్‌లో గురువారం ఓ రైతు రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్నాడు. ఇప్పలపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్, రైతు వెంగళ శ్రీనివాస్‌కు తాడికల్ శివారులో 23 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఇప్పలపల్లి శివారులో పైప్‌లైన్ వేశాడు. తాడికల్ గ్రామానికి చెందిన రైతుల కంటే తక్కువ పరిహారం ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశాడు. మూడేళ్లుగా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఇతర రైతులకు ఇచ్చిన విధంగా పరిహారం పెంచలేదని పనులు నిలిపి వేశారు. తహసీల్దార్ భాస్కర్ క్షేత్రస్థాయిలో పనులు చేపట్టగా రైతు అడ్డుకోవడంతో సమాచారం అందుకున్న బ్లూకోల్ట్స్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. రూ.ఆరులక్షల వరకు పరిహారం చెల్లించాలని, ఇతర రైతులకు ఇచ్చిన విధంగా తనకు చెల్లించాలని తహసీల్దార్‌ను ప్రాధేయపడ్డాడు. వివాదం ముదరడంతో శ్రీనివాస్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఆశలు ఆవిరి

- అడుగంటుతున్న భూగర్భజలాలు
- వట్టిపోతున్న బోరుబావులు
- పంటపొలాలను వదిలేసిన రైతులు



వట్టిపోయిన బోరుబావి

గంగాధర: బోరుబావులను నమ్ముకొని వరి సాగు చేసిన రైతులు బోరుమని విలపిస్తున్నారు. బోరు మంచిగనే పోత్తుంది, పంట పండుతుందనే ఆశతో యాసంగిలో వరిసాగు చేసిన రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. నీళ్లు అడుగంటి పోతుండటంతో పాటు వేసిన బోరుబావులు వట్టిపోవడంతో పంట దక్కించుకోవడానికి రూ.వేలు ఖర్చు చేసి మళ్లీ బోర్లు వేయించినా నిరాశే మిగులుతోంది. మండలంలోని తాడిజర్రి గ్రామానికి ఎటువంటి సాగునీటి వనరులు లేక పోవడంతో వ్యవసాయబావులు, బోరుబావులమీదే ఆధారపడి రైతులు పంటలు సాగు చేస్తుంటారు. వర్షాకాలంలో భూగర్భజలాలు ఎక్కువగా ఉండటంతో పంట దిగుబడి చేతికచ్చిందని, యాసంగిలో వరి పంటసాగు చేస్తే పదిహేను రోజులుగా భూగర్భ జలాలు తగ్గడంతో కొన్నిబోర్లు ఎత్తేసాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంటి ఎల్లయ్య అనే రైతు మూడు బోర్లు వేసి నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాడు. బోరుబావుల్లో నీళ్లు అడుగంటిపోయాయి. విధిలేక, సాగునీటికి దారిలేక పొలం వదిలేశాడు. ఎండలు ముదిరినా కొద్ది వందలాది ఎకరాలకు నీరందక ఎండిపోతాయని రైతులు వాపోతున్నారు. సాగునీటికి తంటాలు పడి పలువురు రైతులు పొలాలు వదిలేశారు.

11 బోర్లు వేశా



ఈ రైతుకు ఏడెకరాల వ్యవసాయ భూమి ఉంది. పంటసాగు చేయడానికి ఐదు సంవత్సరాల్లో 11 బోర్లు వేశాడు. పంటలసాగు, బోర్లు వేయడానికి చేసిన అప్పులు తీర్చడానికి నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి అమ్ముకున్నడు. ప్రస్తుతం సాగు చేస్తున్న పంటను కాపాడుకోవడానికి తంటాలు పడుతున్నడు. బోరుబావుల నుంచి వస్తున్న నీరు రోజురోజుకు తగ్గుతుందని, వరి పంట చేతికచ్చేదాక నమ్మకం లేదని నారాయణ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

– సిరుపురం నారాయణ, రైతు, తాడిజర్రి

రెండున్నర ఎకరాలు అమ్మాను



రంగరావుపల్లి గ్రామానికి చెందిన ఈ రైతుకు తాడిజర్రి శివారులో వ్యవసాయ భూమి ఉంది. నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంటే రెండు బావులు తవ్వించాడు. నాలుగు బోర్లు వేయించాడు. చేసిన అప్పులు కట్టడానికి రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమి అమ్ముకున్నాడు. తవ్వించిన రెండు బావులు, మూడు బోర్లు ఎండి పోయాయి. నీళ్లు పోస్తున్న ఒక్క బోరు బావికింద సాగుచేసిన ఎకరంన్నర పొలం కాపాడుకోవడానికి తంటాలు పడుతున్నాడు. చివరికి నీరందుతుందో లేదోనని అనుమానం వ్యక్తం చేస్తున్నాడు.

– కల్లూరి రవి, రైతు

చుక్క నీరు రావడం లేదు



ఈ రైతు కొద్ది రోజుల క్రితం రూ.డెబ్బై వేలు ఖర్చు చేసి కొత్తగా బోరు వేయించాడు. నీరు పుష్కలంగా వచ్చిందని, కరెంట్ సాంక్షన్, మోటార్, కొత్తగా అచ్చు కట్టడానికి మరింత ఖర్చు చేశాడు. యాసంగిలో వరి సాగు చేయగా పదిరోజుల కింద బోరు నుంచి నీరు రావడం బందయింది. బోరు లోతు చేస్తే నీళ్లు వత్తయని ఆశతో మరో రూ.80 వేలు ఖర్చు చేసి మరింత లోతు వేయించాడు. మోటారు బిగించి చూస్తే చుక్క నీరు రావడం లేదని వాపోయాడు. ఇప్పటి వరకు రూ.నాలుగు లక్షలు ఖర్చు చేసిన సదరు రైతు ఆశతోరోజు మోటారు వేసి చూసినా నిరాశే మిగులింది.

– సంబు మహేశ్, రైతు

నాలుగెకరాలు వదిలేశా



బోరు ఎత్తిపోయిందని, కరంట్ స్టార్టర్ డబ్బాను తీసుకుపోతున్న ఈ రైతు పేరు గుంటి ఎల్లయ్య. ఈయన రూ.తొమ్మిది లక్షలు ఖర్చుపెట్టి వ్యవసాయ బావి తవ్వించాడు. ఆరుబోర్లు వేయడానికి రూ.ఐదు లక్షలు ఖర్చు చేశాడు. బోరుబావులు, బావిలో నీరు అడగంటి పోగా సాగు చేసిన ఐదెకరాల్లో నాలుగు ఎకరాలు వదిలేశాడు. మిగిలిన ఎకరం పొలాన్ని దక్కించుకోవడానికి తంటాలు పడుతున్నాడు.

– గుంటి ఎల్లయ్య, తాడిజర్రి

పోస్టల్ ఉద్యోగుల నిరసన



మాట్లాడుతున్న ఊకంటి మహేందర్, తదితరులు

హుజూరాబాద్: పోస్టల్ ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పోస్టల్ ఉద్యోగుల గ్రూప్–సీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఊకంటి మహేందర్ అన్నారు. గురువారం పోస్టాఫీస్ ఎదుట ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. పోస్టల్ చట్టం 2023 వల్ల సేవలు ప్రైవేట్, కార్పొరేట్ పరం కానున్నాయని, ప్రజల గోప్యతకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందని, గ్రామీణ డాక్ సేవకులకు రెగ్యులర్ హోదా కల్పించి పెన్షన్, గ్రాట్యూటీ, ఆరోగ్య పథకం వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. మార్చి 18 నుంచి పోస్టల్ ఉద్యోగుల దేశవ్యాప్త నిరవధిక సమ్మె కొనసాగుతుందన్నారు. నిరసనలో గ్రూప్–సీ బ్రాంచ్ కార్యదర్శి జక్కు రజినీకాంత్, మాజీ కార్యదర్శి చందనాల గోపి కిషన్, బత్తిని రాజకుమార్, చిలుకమారి ప్రవీణ్, కోలా సందీప్, సామల వేణుగోపాల్, శివం సింగ్, గ్రూప్–డీ డివిజన్ కార్యదర్శి బానోత్ తిరుపతి నాయక్, సంకటి హరీశ్, గ్రామీణ డాక్ సేవక్ నాయకులు సతీష్, స్వామి, రాజేష్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలోనే హామీలు అమలు

సైదాపూర్: ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే అమలు చేసిందని సైదాపూర్ ఏఎంసీ చైర్మన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంత సుధాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. ప్రతిపక్ష నాయకుడు ఫాంహౌస్‌లో ఉంటే సంక్షేమ పథకాల అమలు ఎలా తెలుస్తాయని, బీఆర్‌ఎస్‌ను కాపాడుకోవడానికి కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోతుందంటున్నారని, బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఏ వర్గం అభివృద్ధి చెందలేదన్నారు. ఆరు గ్యారంటీలు ప్రజలకు అదించిన కాంగ్రెస్ ప్రభుత్వ గ్రాఫ్ ఎలా పడిపోతుందని మండిపడ్డారు.

నేడు ఈజీఎస్ సామాజిక తనిఖీ

హుజూరాబాద్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించనున్నామని ఎంపీడీవో తూర్పాటి సునీత గురువారం ప్రకటనలో తెలిపారు. 19 గ్రామ పం చాయతీలకు సంబంధించి 2023–24 సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీపనులు, 15వ విడుత చేపట్టనున్న పనులపై పది గంటలకు సమావేశం జరుగుతుందన్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పాలనలో విద్యార్థులకు ఒరిగిందేమీలేదు

మానకొండూర్: కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి చిన్నమలై అంజిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మండలంలోని గంగిపల్లి గ్రామంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు భాస్కరాచారి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో విద్యార్థులకు ఒరిగిందేమీ లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థులను మోసగిస్తుందన్నారు. నరేందర్‌రెడ్డి విద్యార్థులు, యువతకు చేసిందేమీ లేదని అంజి రెడ్డి భారీ మెజార్టీతో గెలవబోతున్నారని, పట్టభద్రులు అందరూ అంజిరెడ్డిని గెలిపించాలని కోరారు.

చిగురుమామిడి: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొంరయ్యకు రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి బోయినపల్లి ప్రవీణ్‌రావు అన్నారు. గురువారం సాయంత్రం చిగురుమామిడిలో ఎమ్మెల్సీ ఎన్నికల రివ్యూ సమావేశం నిర్వహించారు. గ్రామ ఇన్‌చార్జీలతో సమాచారం సేకరించారు. పల్లెల్లో మంచి ఆదరణ లభిస్తుందని, తప్పకుండా మొదటి ప్రాధాన్యత ఓట్లు పడే అవకాశం ఉందన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీ బూత్ ఇన్‌చార్జీలు, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని వెలిచాల, రుద్రారం గ్రామాలలో ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొంరయ్యకు మద్దతుగా బీజేపీ నాయకులు ప్రచా రం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో నాయకులు ఉప్పు రాంకిషన్, శ్రీనివాస్, నర్సింగం, నవీన్, రేగు రి దిలీప్, రామచందర్‌రావు, రాజేందర్, సాగర్, కట్ట రవీందర్, పురుషోత్తమచారి, నరేష్, వీర య్య, రవీంద్రాచారి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌రావుపేటలో చోరీ

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన గోలి మధుసూదన్‌రెడ్డి ఇంటిలో చోరీ జరిగింది. ఎస్సై వి. శేఖర్ తెలిపిన వివరాలు.. గత బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని, పది తులాల బంగారం, రూ.రెండులక్షలు ఎత్తుకెళ్లారని బాధితుడి ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

శ్రీవేంకటేశ్వర ఆలయ హుండీల ఆదాయం లెక్కింపు



కరీంనగర్ కల్చరల్: మార్కెట్ రోడ్‌లోని వేంకటేశ్వర ఆలయం హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. రూ.15,71,953 సమకూరినట్లు ఈవో సుధాకర్ తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిన లెక్కింపులో ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, గోవిందపతి సేవకులు పాల్గొన్నారు.

వ్యవసాయేతర భూముల ఆన్‌లైన్

- వివరాలు నమోదు చేస్తున్న అధికారులు



ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్న తహసీల్దార్ రాజు, ఏవో సత్యం తదితరులు

కరీంనగర్‌రూరల్: వ్యవసాయేతర భూముల పూర్తి వివరాలను గురువారం నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను రెవెన్యూ, వ్యవసాయాధికారులు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పథకం అమలు చేసేందుకు సాగు భూముల వివరాల సేకరణ చేపట్టింది. గత నెల 16 నుంచి 20 వరకు ఏఈవోలు కరీంనగర్ మండలంలోని 14 రెవెన్యూ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. మొత్తం 18,920 ఎకరాల వ్యవసాయ భూములుండగా ఏఈవోలు సర్వే చేసి 1,317 వ్యవసాయేతర భూములను గుర్తించారు. మిగితా 17,605 ఎకరాలకు రైతుభరోసా మంజూరుకు అర్హతగా నిర్ణయించారు. అయితే ప్రభుత్వం ప్రస్తుతం ఏఈవోలు గుర్తించిన వ్యవసాయేతర భూముల్లోని వివరాలను ఆన్‌లైన్ చేసేందుకు అవకాశం కల్పించింది. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజు, ఏవో సత్యం, ఏఈవో పైడితల్లి వ్యవసాయేతర భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఒక్కో గ్రామంలోని వ్యవసాయేతర భూమిలో ఉన్న నిర్మాణాలు, వంతెనలు, నేషనల్ హైవే రోడ్లు, ఎస్సారెస్పీ కాలువల కోసం సేకరించిన స్థలం, పరిశ్రమలు, వ్యాపార నిర్వహణ, నాలా కన్వర్షన్ భూముల పూర్తి వివరాలు ఆన్‌లైన్ చేస్తున్నారు. దీనిలో భాగంగా బొమ్మకల్, చేగుర్తి, దుర్శేడ్, ఎలబోతారం, ఇరుకుల్ల, జూబ్లీనగర్, నగునూరు, నల్లగుంటపల్లి గ్రామాల్లోని మొత్తం 36.35 ఎకరాల వివరాలను ఆన్‌లైన్ చేశారు. వ్యవసాయేతర భూముల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ శనివారం వరకు పూర్తిచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

జెడ్పీ పాఠశాలల తనిఖీ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని జూబ్లీనగర్, చామనపల్లి, మొగ్దుంపూర్ జెడ్పీ పాఠశాలలను గురువారం ఎంఈవో కె.రవీందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జూబ్లీనగర్ పాఠశాలలో జన్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విటమిన్ గార్డెన్‌ను పరిశీలించారు. ప్రణాళిక ప్రకారం పెంచుతున్న కూరగాయల వివరాలను అడిగి తెలుసుకున్నారు. చామనపల్లి, మొగ్దుంపూర్ జెడ్పీ పాఠశాలల్లో పదో తరగతి ప్రత్యేక తరగతులను తనిఖీ చేశారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.



చిగురుమామిడి: మండలంలోని సుందరగిరిలో హుస్నాబాద్–కరీంనగర్ ఆర్‌అండ్‌బీ ప్రధాన రోడ్డు పక్కన మిషన్ భగీరథ పథకం పైపులైన్ పగిలిపోయి మూడు నెలలు కావస్తోంది. మరమ్మతుల కోసం గుంత తవ్వినా మరమ్మత్తులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. రోడ్డు పక్కనే గుంత, గుంత నుంచి రక్షిత మంచినీరు నీటి సరఫరా సమయంలో వృథాగాపోతోంది. గ్రామస్తులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయిందని, ఇకనైనా స్పందించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సురేశ్, మిషన్ భగీరథ ఏఈఈ, సెల్ నంబర్: 7995660378

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవాలు ప్రారంభం



ముస్తాబైన ఆలయం

చొప్పదండి: మండలంలోని రాగంపేట గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వార్షికోత్సవాలకు ముస్తాబైంది. గురువారం యాగశాల ప్రవేశం అగ్ని ప్రతిష్ఠతో ధ్వజారోహణం గావించారు. శుక్రవారం విష్ణు సహస్ర నామ పారాయణం, శనివారం ఎదుర్కోలు, ఆదివారం ఉదయం శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. సోమవారం సుదర్శన నారసింహ హోమంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.



క్షేత్ర సందర్శన

గన్నేరువరం: మండలంలోని వ్యవసాయ శాఖ అధికారులు, ఫర్టిలైజర్ డీలర్లు పంటల సాగుపై గురువారం మండలంలోని రెండు గ్రామాల్లో క్షేత్రస్థాయి సందర్శన కార్యక్రమం నిర్వహించారు. కరీంనగర్‌లోని రైతు శిక్షణ కేంద్రం ఆత్మ ఆధ్వర్యంలో మండలకేంద్రం గన్నేరువరం, ఖాసీంపేట గ్రామాలకు చెందిన ఫర్టిలైజర్స్ అండ్ ఫెస్టిసైడ్స్ డీలర్లు సందవేని ప్రశాంత్, బద్దం మహిపాల్‌రెడ్డికి ఏడాది డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ కోర్సు శిక్షణ ఇచ్చారు. అలాగే ప్రశాంత్, మహిపాల్‌రెడ్డిలు సాగు చేస్తున్న మొక్కజొన్న, బొప్పాయి పంటలను పరిశీలించి, చీడ పీడల నివారణ, సస్యరక్షణ చర్యలు డీసీస్ ఫెసిలిటేటర్ రామచందర్‌రావు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి కిరణ్మయి, రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి మమత, ఆత్మ బీటీఎం స్రవంతి, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

గంగాధర: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా మండలంలోని నాగిరెడ్డిపూర్ గ్రామంలో కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వొడ్నాల యగ్నేశ్ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలువురు పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటేసి నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఏ.రోహిత్ రెడ్డి, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్, రంజిత్ గౌడ్, కుమార స్వామి, నారాయణపూర్ గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నవీన్, అనిల్ రెడ్డి, ప్రవీణ్, భరత్, సాయికిరణ్ పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి, చిగురుమామిడి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు ఆదరించి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని హుస్నాబాద్ వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్, చిగురుమామిడి కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి కోరారు. ప్రచారంలో డీసీసీ అధికారప్రతినిధి సత్యనారాయణరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు వేణుగోపాల్, పార్టీ మండల ప్రధానకార్యదర్శి లచ్చిరెడ్డి, సుందరగిరి గ్రామ అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు. నరేందర్‌రెడ్డికి మద్దతుగా మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఓటర్లు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మాజీ జెడ్పీటీసీ మన్మోహన్‌రావు, గ్రామ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిఅనిల్, కాంపెల్లి రవీందర్, తిరుపతిగౌడ్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సైదాపూర్: నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటేసి గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి కోరారు. మండల కేంద్రంలో మాట్లాడుతూ.. అత్యంత ప్రమాదకరమైన పార్టీ బీజేపీ అని, రాష్ట్రం ఇస్తే బీఆర్‌ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తానన్న కేసీఆర్ తెలంగాణ వచ్చాక తానే సీఎం అయ్యాడని, సీఎల్పీనే లేకుండా చేసి బీఆర్‌ఎస్‌లో విలీనం చేసుకొని ఇప్పుడు పార్టీ మారిన వారిపై దుష్ప్రచారం చేస్తున్నారని, కమ్యూనిస్టులు కాంగ్రెస్‌కు తొత్తులనడం సరికాదన్నారు. వెంట జిల్లా కమిటీ సభ్యులు బాబు, అశోక్, రవీందర్‌రెడ్డి, మండల నాయకులు అనిల్, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలి



అవగాహన కల్పిస్తున్న హౌసింగ్ డీఎం గంగాధర్

కరీంనగర్‌రూరల్: ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని హౌసింగ్‌బోర్డు డీఎం గంగాధర్ అన్నారు. గురువారం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన కరీంనగర్ మండలం బహదూర్‌ఖాన్‌పేటలో ఎంపికైన 106 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం కోసం శుక్రవారం నుంచి ముగ్గులు పోసి పనులు ప్రారంభించాలన్నారు. సర్వే సందర్భంగా చూపించిన ఖాళీ స్థలంలో మాత్రమే ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఇంటిని 400 చదరపు అడుగుల వరకు నిర్మించుకోవాలని, విడతల వారీగా రూ.5 లక్షలు అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పలువురు లబ్ధిదారుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేందర్‌తో పాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్ జిల్లాకు చెందిన రాజు, భానుప్రసాద్‌రెడ్డిలు సంయుక్తంగా కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్‌పై దయా దర్శకత్వంలో నిర్మించిన 'బాపు' చలన చిత్ర పోస్టర్‌ను కరీంనగర్ ఫిలిం సొసైటీ బాధ్యులు గురువారం రాత్రి కఫిసా భవన్‌లో ఆవిష్కరించారు.